

జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పాల్వంచ ఉన్నత పాఠశాలకు మొదటి బహుమతి

మాచారెడ్డి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బాన్సువాడలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రథమ బహుమతి గెలుచుకున్నారని ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మరో ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. మొత్తం మూడు బహుమతులు పాఠశాలకు రావడం గర్వంగా ఉందని తెలిపారు. విద్యార్థులకు, గైడ్ టీచర్‌లను అభినందిస్తున్నామని ఆయన తెలిపారు.

మృత్యుదారులు!



భిక్కనూరు జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

- జిల్లాలో ఏదో ఒకచోట ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు
- సగటున ఇద్దరు మృత్యువాత.. పదుల సంఖ్యలో క్షతగాత్రులు
- అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నా ఆగని రోడ్డు ప్రమాదాలు
- ఈ ఏడాది 400లకుపైగా ప్రమాదాలు.. 248 మంది మృత్యువాత
- వీధినపడుతున్న కుటుంబాలు

కామారెడ్డి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రధాన రహదారులు మృత్యుదారులుగా మారుతున్నాయి. ప్రధాన రహదారులపై ప్రయాణించాలంటేనే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట రహదారులపై ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ప్రధానంగా జాతీయ రహదారులతో పాటు రాష్ట్రీయ రహదారుల్లో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాలపై అధికార యంత్రాంగం, పోలీసుశాఖ అవగాహన కల్పిస్తున్నా ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. ప్రతిఏటా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతునే ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో చాలా మంది దుర్మరణం చెందడమే కాకుండా క్షతగాత్రులై కుటుంబాలు రోడ్డున పడుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ ఏడాదిలో 10 నెలల్లో జిల్లా వ్యాప్తంగా 400కు పైగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా 248 మంది మృతి చెందినట్లు పోలీసుశాఖ రికార్డులు చెబుతున్నాయి.

జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు

భిక్కనూరు మండలంలోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం ఎదురెదురుగా వస్తున్న కారు లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. డిసెంబరు 1న బిచ్కుందలో ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందారు. ఈనెల 2వ తేదీన పిట్లం మండలం తిమ్మానగర్ తండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ పాఠశాల పీడీ మల్లేష్ మృతి చెందాడు. నవంబరు 28న జుక్కల్ మండలం కౌలాస్ గ్రామం శివారులో 166 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. నవంబరు 23న పిట్లం మండలంలోని 161వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. నవంబరు 16న తాడ్వాయి మండలంలో స్కూల్ బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దుసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. నవంబరు 14న భిక్కనూరు మండలంలోని 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. అక్టోబరు 14న రామారెడ్డి గంగమ్మవాగు బ్రిడ్జి వద్ద లారీ బోల్తాపడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. అక్టోబరు 16న బిచ్కుంద మండలం జాతీయ రహదారి 161పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరుగొండ అనే వ్యక్తి మృతి చెందాడు. అక్టోబరు 25న సదాశివనగర్ మండలం 44వ జాతీయ రహదారిపై ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వాహనాన్ని లారీ ఢీకొంది.

ఏడాదిలో 400కు పైగా ప్రమాదాలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలపై అధికార యంత్రాంగంతో పాటు పోలీసుశాఖ, రవాణా శాఖలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రమాదాలు మాత్రం ఆగడం లేదు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసుశాఖ ఎన్నో చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు. బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 31 బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ప్రమాదాల కట్టడికి చర్యలు చేపట్టారు. అయినా ప్రమాదాలు తగ్గకపోవడం ఆందోళనలు కల్గిస్తోంది. కొన్నిచోట్ల ఎదురుదెరుగా వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతుండగా మరికొన్ని చోట్ల వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంకొన్నిచోట్ల రాంగ్‌రూట్‌లో ప్రయాణం, అతి వేగం, మద్యం తాగి వాహనాలు నడపడం వంటి కారణాలతో ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. 2024 సంవత్సరంలో పది నెలల్లో 400కు పైగా రోడ్డు ప్రమాదాలు జరుగగా 248 మంది మృత్యువాత పడ్డారు. 430మంది క్షతగాత్రులయ్యారు. 2023లో 501రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా 236మంది మృతి చెందారు. మరో 480 మంది క్షతగాత్రులయ్యారు. 2022లో 516 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా 271 మంది మృతి చెందారు. 503మంది క్షతగాత్రులయ్యారు.

అతివేగం, నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం

జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగం, నిర్లక్ష్యమేనని పోలీసు శాఖ చెబుతోంది. వాహనాలను అతివేగంగా నిర్లక్ష్యంగా నడపడం వల్లే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసుశాఖ దర్యాప్తులో తేలుతోంది. ముఖ్యంగా జాతీయ రహదారులపై లారీలు, కార్లు వేగంగా దూసుకెళ్తుంటాయి. వేగం పరిమితి విధించినా జరిమానాలు పడుతున్నా వాహనదారులు వేగం తగ్గించడం లేదు. అతివేగంగా వాహనాలను నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు కూడా కొందరు అజాగ్రత్తగా నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తాగి వాహనాలను నడపడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి కోర్టులు జైలుశిక్ష విధిస్తున్నా మార్పులు రావడం లేదు.

రోడ్డున పడుతున్న కుటుంబాలు

ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలతో పాటు క్షతగాత్రులకు వైద్య కోసం రూ.లక్షలు ఖర్చు చేయాల్సిన పరిస్థితుల్లో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారుతోంది. తీవ్రగాయాలతో ఆసుపత్రుల పాలవుతున్న వారికి వైద్యం కోసం పెద్ద ఎత్తున ఖర్చు అవుతుంది. వారిని కాపాడుకునేందుకు ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుంది. వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు సూచిస్తున్నారు.



కౌలాస్ గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు యువకులు (ఫైల్)



పిట్లం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి (ఫైల్)

నిజాంసాగర్ లీకేజీ నీటికి అడ్డుకట్ట



వరద గేట్ల అంతర్భాగంలో మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

నిజాంసాగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి వెళ్లకుండా నీటి పారుదలశాఖ అధికారులు అరికడుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ఏడాది సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం నీటితో నిండిపోయింది. దీంతో ప్రాజెక్టు నిండు జలాలతో కలకలాడుతోంది. వీఆర్ నెంబర్ 5లోని వరద గేట్ల కింది భాగం నుంచి ప్రాజెక్టు నీరు వృథాగా వెళుతూ ఉండేది. ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీరు లీకేజీలు కాకుండా నీటి పారుదల శాఖ సిబ్బంది కంకర మట్టి గేట్ల అంతర్భాగంలో వేస్తూ లీకేజీ నీటిని అరికడుతున్నారు.

ఘనంగా భగలాముఖి పీఠంలో అష్టమి పూజ



ఆలయంలోని భగలాముఖి పీఠం

ఎల్లారెడ్డి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీడీ వర్కర్స్ కాలనీలో ఆర్టీసీ బస్ డిపో పక్కన ఉన్న భగలాముఖి పీఠంలో ఆదివారం అమ్మవారి జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని అష్టమి పూజ నిర్వహించారు. పీఠం నిర్వాహకులు క్రాంతి పటేల్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి పటేల్ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ పూజా కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భక్తులతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాలు మండలాలకు చెందిన భక్తులు, స్థానికులు సంతోష్, మరుమల్ల వెంకన్న, రేవంత్ అప్ప, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ ఆలయ సప్తమ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న మాధవానంద సరస్వతీ, గ్రామస్థులు

నిజాంసాగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో గల అభయాంజనేయ స్వామి (ఏకశిల) శివ పంచాయతన సహిత విగ్రహ సప్తమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రంగంపేట ఆశ్రమ వ్యవస్థాపకుడు మాధవానంద సరస్వతీ ప్రత్యేక పర్యవేక్షణలో వైభవంగా జరిగాయి. మాధవానంద సరస్వతీ అభయాంజనేయ ఏకశిల విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 108 నదీ జలాల అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైభవంగా జరిగిన ఈ వార్షికోత్సవ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మాధవానంద సరస్వతి ఆశీస్సులు భక్తులు పొందారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే ఉభయ జిల్లాల మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మాజీ ఎంపీపీ జ్యోతి, దుర్గారెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్‌గౌడ్, విండో అధ్యక్షుడు కెనరసింహారెడ్డి, వాజీద్‌అలీ, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

కామారెడ్డి టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి మల్లన్న గుడి వద్ద శనివారం రాత్రి అయ్యప్పస్వామి మహాపడిపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి అయ్యప్ప సేవా సంఘం, స్వామి అయ్యప్ప అన్నప్రసాద సేవాసమితి ఆధ్వర్యంలో ఇంటింటా అయ్యప్ప ఊరంత అయ్యప్ప అనే కార్యక్రమాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ పడి పూజకు దేవునిపల్లివాసులు స్వామి వారికి 118 లీటర్ల క్షీరాభిషేకాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అయ్యప్ప మాలధారులు, ప్రజలు పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాలపై ఆందోళనబాటలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు
- హామీలకే తప్ప అమలుకు నోచుకుని ప్రజాప్రతినిధుల వాగ్దానాలు
- మూడు రోజులుగా కొనసాగిస్తున్న రిలే నిరసన దీక్ష
- ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోతే రేపటి నుంచి సమ్మె
- జిల్లాలో 750 మంది ఉద్యోగులు



రిలే నిరసన దీక్షలు చేపడుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ అభివృద్ధికి ప్రవేశ పెట్టే అనేక కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంతో పాటు విద్యాశాఖకు వారధిగా నిలుస్తూ పేద పిల్లలకు సౌకర్యాలతో కూడిన విద్యను అందేలా చూస్తున్న సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి మరోమారు ఆందోళన బాట పట్టారు. సమగ్రశిక్ష అభియాన్ విభాగంలో 16 సంవత్సరాలుగా జిల్లా స్థాయిలో డీఈవోలు, సిస్టమ్ అనలిస్టులు, ఏపీవోలు, టెక్నికల్ పర్సన్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డీఎల్ఎం ఎంట్రీ అటెండర్లు, రీసోర్స్‌పర్సన్‌లుగా భవిత కేంద్రాలతో పాటు మండల రిసోర్స్ పర్సన్‌లు, కేజీబీవీల్లో, స్కూళ్లలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో సీఆర్పీ తమ పరిధిలోని పాఠశాలలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి అందిస్తూ డీఈవో, ఎంఈవోలకు మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తున్నారు. బోధనేతర బిల్లు, మధ్యాహ్న భోజన బిల్లులు తయారు చేయడం, డీఈవో కార్యాలయం నుంచి అడిగిన ప్రతీ సమాచారాన్ని సేకరించి పంపడం, పాఠశాలల్లో ఉపాధ్యాయులు రాని సమయంలో విధులు నిర్వర్తించడం, పండుగలు, పబ్బాలు అని లేకుండా కేజీబీవీల్లో విధులు నిర్వహించడం, ప్రైవేట్ పాఠశాలల గుర్తింపులు, యూడైస్ వివరాలు తదితర పనులు చేస్తున్నారు. ఇంత చేస్తున్నా తమకు సరైన సౌకర్యాలు అందడం లేదని, తమకు ఉద్యోగభద్రత కల్పించాలని, పేస్కేల్ అమలు చేయాలని గత ప్రభుత్వ హయాంలోనే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. అయితే గతంలో ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సమగ్రశిక్ష ఉద్యోగులకు ప్రభుత్వం ఏర్పడగానే తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని కానీ ఇప్పటి వరకు ఎలాంటి అమలు కనపడకపోవడంతో మళ్లీ మూడు రోజులుగా రిలే నిరసన దీక్ష చేపడుతున్నామని అయినా ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 10 నుంచి సంపూర్ణ సమ్మెకు వెళ్లనున్నట్లు ప్రకటించారు.

16 ఏళ్ల క్రితం ఏర్పడిన సమగ్రశిక్ష అభియాన్

సమగ్రశిక్ష అభియాన్ 2008లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమల్లోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ఈ ప్రాజెక్టు ఏర్పడింది. అప్పటి నుంచి దాదాపు 16 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలోనే ఈ విభాగంలోని ఉద్యోగులు పని చేస్తున్నారు. చాలీచాలని వేతనాలతో, అధిక పని భారంతో సతమతమవుతున్నామని, తమను క్రమబద్ధీకరించాలంటూ అనేక రకాలుగా పోరాటాలు చేస్తున్నారు. గత ప్రభుత్వం వివిధ సందర్భాల్లో తమకు తగిన న్యాయం చేస్తామని అప్పటి సీఎం, విద్యాశాఖ మంత్రి హామీ ఇచ్చారని ఆ హామీలు అమలుకు నోచుకోకపోవడంతో ఆందోళన బాట పట్టారు. ఈ సమయంలో అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడగానే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని ఇంత వరకు ఆ వైపు ఆలోచన చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 750 మంది ఉద్యోగులు

జిల్లాలో సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 750 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరంతా ఉద్యోగానికి సంబంధించిన అర్హతలు కలిగి రూల్ ఆఫ్ రిజర్వేషన్ మెరిట్ కం రోస్టర్ ప్రకారం కలెక్టర్ చైర్మన్‌గా కలిగిన డీఎస్‌సీ కమిటీ ఆధ్వర్యంలో రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ఎంపికై కాంట్రాక్ట్ పద్ధతిన నియమించబడ్డారు. వీరు డీఈవో, ఎంఈవో కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 750 మంది ఉద్యోగుల్లో కేజీబీవీ బోధనేతర, బోధన సిబ్బంది 480, డీపీఓలు 7, యూఆర్ఎస్, బోధనేతర సిబ్బంది 10, ఎంఐఎస్ సమన్వయ కర్తలు 22, పీటీఐలు 71, సీజీవీలు 18, సీసీఓలు 22, సీఆర్పీలు 76, ఐఈఆర్పీలు 26, మెసెంజర్‌లు 18 మంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న వీరికి నెల వేతనాలు రూ.8500 నుంచి రూ.32వేల వరకు ఉన్నాయి. ఎక్కువ శాతం రూ.19,500 వేతనాలు అందుకుంటున్న వారే అధికంగా ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని నాలుగేళ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఆందోళన ఉధృతం చేస్తున్నారు. ఇప్పటికే వివిధ రకాలుగా ఉద్యోగులు జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. వీరంతా ప్రతి ఉద్యోగిని రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ నియామకాల్లో వేయిటేజీ కల్పించాలని, రూ.20లక్షల జీవితా బీమా, 10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం తదితర వాటిని కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా స్థాయిలో గత మూడు రోజుల నుంచి కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద గల మహనీయుల విగ్రహాల ముందు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చకుంటే ఈనెల 10 నుంచి సమ్మెకు వెళ్తామని హెచ్చరిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలను కలుస్తూ తమ గోడును అసెంబ్లీలో లేవనెత్తాలని వినతులు అందిస్తున్నారు.



ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు వినతి పత్రం అందిస్తున్న ఉద్యోగులు



కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి..

ఉద్యోగ భద్రత కల్పించాలి

- సత్యనారాయణ, సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

గత 16 సంవత్సరాలుగా విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్నా ఇంత వరకు రెగ్యులర్ చేయలేదు. తమ విధుల్లో భాగంగా మధ్యాహ్న భోజన బిల్లులు, బియ్యం సరఫరాకు సంబంధించిన వివరాలు, ఉపాధ్యాయుల జీతభత్యాలు, యూడైస్‌తో పాటు ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన గుర్తింపు వివరాలు తదితర అనేక విధులు నిర్వహిస్తున్నాం. ఇంత వరకు తమకు ఉద్యోగ భద్రత అనేది లేదు. ప్రజాప్రతినిధులు ఎన్నో సార్లు హామీలు ఇచ్చారే తప్ప అమలుకు మాత్రం కృషి చేయడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు తాము వివిధ ఆందోళన కార్యక్రమాలు చేపడితే అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం ఏర్పడగానే తగిన న్యాయం చేస్తామని తెలిపారు. పది నెలలు గడుస్తున్నా ఎలాంటి న్యాయం జరగకపోవడంతో నిరసన దీక్షలు చేపట్టాం.

వసతులు లేని వసతి గృహాలు

● చలికాలం ప్రారంభమైనా జాడలేని దుప్పట్లు, స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ● ఇబ్బందుల పాలవుతున్న విద్యార్థులు



పగిలిన వసతి గృహం కిటికీల దృశ్యం



బోధన్‌లోని ప్రభుత్వ వసతి గృహం ఇదే..

బోధన్‌రూరల్,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహలో అడుగడుగునా సమస్యలే దర్శనమిస్తున్నాయి. వసతి గృహల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించకపోవడంతో అందులో ఉండే విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. చలికాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు విద్యార్థులకు అవసరమైన వాటిని అందించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. చలితో ప్రజలు గడగడ వణికిపోతున్నారు. వసతి గృహల్లోనే ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు పరిస్థితి కడు దయనీయంగా మారింది. వసతి గృహల్లో ఉండే విద్యార్థులకు ఇప్పటి వరకు దుప్పట్లు, స్వెటర్లు, మంకీ క్యాప్‌లు అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభ/త్వ వసతి గృహలో సరైన సౌకర్యాలు లేక తలుపులు, కిటికీలు సరిగ్గా లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. వసతి గృహల్లో ఉన్న విద్యార్థులకు భద్రత కరువైంది. వారిని పట్టించుకునే నాథుడు కరువయ్యాడన్న వాదనలు వినిపిస్తున్నాయి. బోధన్‌లో మొత్తం 11 వసతి గృహల్లో ఉండగా ప్రతి వసతిగృహంలోనూ సమస్యలే దర్శనమిస్తున్నాయి.

● జాడలేని దుప్పట్లు, స్వెటర్లు, మంకీ క్యాప్‌లు

బోధన్‌లో మొత్తంలో 11 వసతిగృహలు ఉన్నాయి. ఇందులో ఐదు కాలేజీ వసతిగృహలు, రెండు ఎస్సీ వసతిగృహలు, రెండు బీసీ వసతి గృహలు, ఒక ఎస్టీ వసతిగృహం ఉన్నాయి. అలాగే 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు ఎస్సీ మూడు వసతిగృహలు, బీసీ రెండు వసతిగృహలు, ఎస్టీ ఒక వసతిగృహం ఉన్నాయి. చలి కాలం ప్రారంభమైన ఇప్పటి వరకు విద్యార్థులకు దుప్పట్లు, రగ్గులు, స్వెటర్లు, మంకీ క్యాప్‌లు పంపిణీ చేయలేదు. వసతిగృహల్లోని తలుపులు, కిటికీలు సైతం పగిలిపోయి వాటి ద్వారా చల్లని గాలి గదులోకి వస్తుండడంతో విద్యార్థులు రాత్రి వేళలో చలికి వణికిపోతున్నారు.

● వసతిగృహలపై పట్టింపేదీ.?

బోధన్ డివిజన్‌లో ఉన్న ప్రభుత్వ వసతిగృహలల్లోని విద్యార్థులపై అధికారులకు పట్టింపు కరువైంది. చలితో అనేక వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. చలి జ్వరాలు, ఇతర రోగాల బారిన ప్రమాదమున్న అధికారులు మాత్రం విద్యార్థుల రక్షణ చర్యలు చేపట్టడం లేదు. అధికారుల తీరు వల్ల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. చదువుకునేందుకు ఇతర ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులకు సరైన వసతులు లేక వసతిగృహలు వెక్కిరిస్తున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి చలికాలంలో విద్యార్థులకు కావాల్సిన దుప్పట్లు, రగ్గులు, మంకీ క్యాప్‌లు, స్వెటర్లు అందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

త్వరలోనే దుప్పట్లను పంపిణీ చేస్తాం

ప్రభుత్వ హస్టళ్ల విద్యార్థులకు త్వరలోనే దుప్పట్లను పంపిణీ చేస్తాం. ఇప్పటి వరకు ఇంకా దుప్పట్లు వసతి గృహాలకు చేరుకోలేదు. రాగానే పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం. వసతి గృహల్లోని విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- విఠల్, హాస్టల్ వార్డెన్, బోధన్

వైభవంగా ఆదిమల్లన్నస్వామి జాతర, రథోత్సవం

వేల్పూర్,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆదిమల్లన్న స్వామి జాతర, రథోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆదిమల్లన్నకు నైవేద్యాలు సమర్పించే మొక్కులు తీర్చుకునేందుకు పెద్దఎత్తున బారులు తీరారు. గ్రామం నుంచి పెద్ద ఎత్తున బోనాలతో పాటు రంగు రంగుల బంతిపువ్వులతో అందంగా అలంకరించిన షిడే(రథం)ను డప్పువాయిద్యాల మధ్య భక్తులు తాడుతో గుట్ట చుట్టు ప్రదక్షిణ చేశారు. ఆలయం వద్ద సత్యనారాయణ వ్రతాలతో పాటు పుట్టు వెంట్రుకలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగ కుండా పోలీసులు బందోబస్తు నిర్వహిం చారు.



పడిగెలలో ఆదిమల్లన్నస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

జాతరలో స్థానిక ప్రభుత్వ పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు జాతరలో సెక్యూరిటీలుగా నిర్వహించారు. ఈ జాతరకు పడిగెలతో పాటు చుట్టు పక్కల గ్రామాల జగిత్యాల్, నిర్మల్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించారు.

భర్త చేతిలో భార్య దారుణహత్య

ముప్కాల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ఏడడుగులు తోడుంటానని మూడు ముళ్లు వేసిన ఓ కసాయి భర్త చేతిలో భార్య దారుణహత్యకు గురైన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. ఈ సంఘటనకు సంబంధించి ఆర్మూర్‌రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర బిలోలి తాలూకా బీల్గోనికు చెందిన జంగ శివకళ(30) భర్త రాజు గంగారాం రెండేళ్ల క్రితం బదుకుదెరువు కోసం బాల్కొండ మండలం వన్నెల్(బి)లో వ్యవసాయ పనుల కోసం వచ్చి జీవిస్తున్నారు. అన్యోన్యంగా ఉన్న వారి కాపురంలో భర్త మద్యంకు బానిసై తరచు గోడవ పడేవాడు. అయితే భర్త శనివారం మద్యం మాన్పించేందుకు ఆయుర్వేద మందు తగ్గించేందుకు తీసుకెళ్లింది. రాత్రి ఇద్దరు కలిసి భోజనం చేసే నిద్రించగా తెల్లవారే సరికి శివకళ హత్యకు గురైంది. భర్త రాజు గోడ్డలితో బాధి బయట గడియపెట్టి పరిపోయాడు. ఉదయం యాజమాని ఇంటికి వెళ్ళి చూడగా రక్తపు మడుగులో విగతా జీవిగా పడి ఉంది. సమాచారం తెలుసుకున్న ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, బాల్కొండ ఎస్సై నరేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి డెడ్‌బాడిని పోస్టుమార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఆమె తల్లి ఫిరాజీ రాధబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.



శివకళ (ఫైల్)

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కమ్మర్‌పల్లి, డిసెంబరు 8: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన 20 మంది, అమీర్‌నగర్ కు చెందిన 6 మంది బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు పంపిణిచేశారు. అనారోగ్యపరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటున్న నిరుపేదలను ఆదుకునే నిమిత్తం బాల్కొండ ఎమ్మెల్యే మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో బిదిత కుటుంబాలకు సీఎం ఆర్థిక సహయం అందజేసినట్లు బిఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంరిలీఫ్ ఫండ్ మంజూరి చేయించిన బాల్కొండ ఎమ్మెల్యే మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి, స్థానిక బిఆర్ఎస్ నాయకులుకు బాదితులు వారి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కమ్మర్‌పల్లిలో..

కమ్మర్‌పల్లి, డిసెంబరు 8: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన 20 మంది, అమీర్‌నగర్ కు చెందిన 6 మంది బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ఆయా గ్రామాల భిఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. అనారోగ్యపరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటున్న నిరుపేదలను ఆదుకునే నిమిత్తం బాల్కొండ ఎమ్మెల్యే మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో బిదిత కుటుంబాలకు సీఎం ఆర్థిక సహయం అందజేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంరిలీఫ్ ఫండ్ మంజూరి చేయించిన బాల్కొండ ఎమ్మెల్యే మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి, స్థానిక బీఆర్ఎస్ నాయకులుకు బాదితులు వారి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయనిధి సేవలకు వరం

మెండోర, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): సీఎం సహయనిధి పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సాకాలి సాయన్న ఇటీవల అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. చికిత్స చేయించుకున్న ఖర్చులకు సీఎం సహయనిధి ద్వారా ఇప్పించాలని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కు మార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అందుకు స్పందించిన సునీల్‌కుమార్ సీఎం సహాయనిధి ద్వారా చెక్కును మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొప్పెల మోహన్, మౌలానా, నోముల రాజన్న, ప్రతాప్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు స్టడీ టూర్‌కు వెళ్లిన వేల్పూర్ ఏఎంసీ

వేల్పూర్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని పలు వ్యవసాయ మార్కెట్ కమిటీల పనితీరు స్టడి చేయడానికి ఆదివారం వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం వెళ్ళారు. వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యం రెడ్డి, అధికారులు ఆధ్వర్యంలో ఏఎంసీ పాలకవర్గం సభ్యులు ప్రత్యేక బస్సులో వెళ్ళారు. ఆయా రాష్ట్రాల్లోని ముఖ్యమైన మార్కెట్‌లను సందర్శించడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

వెల్కటూర్‌లో సార్గమ్మ మారెమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన



వెల్కటూర్‌లో దేవతల విగ్రహాలకు ఊరేగిస్తున్న భక్తులు

మెండోర, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్కటూర్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సార్గమ్మ మారెమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సార్గమ్మ మారెమ్మ విగ్రహాలను గ్రామ వీధులగుండా డప్పుచప్పుళ్లతో పోతరాజుల విన్యాసాలతో ఊరేగించారు. అనంతరం దేవతల విగ్రహాలను అంగరంగా వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామప్రజలు, తదితరులు పాల్గొన్నారు

ఏర్గట్లలో మల్లన్న స్వామి బోనాల ఊరేగింపు

ఏర్గట్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మల్లన్న స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన బోనాలు ఆలయం వరకు తీసుకెళ్లి మల్లన్న స్వామికి సమర్పించారు. యాదవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ వద్ద జాతర అన్న ప్రసాదం నిర్వహిస్తున్నామని ఇట్టి ఉత్సవాల్లో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని నిర్వహాకులు కోరారు.

మల్లన్న స్వామి ఆలయ వార్షికోత్సవం

కమ్మర్‌పల్లి, డిసెంబరు 8: (ఆంధ్రజ్యోతి)మండంలోని బషీరాబాద్ గ్రామ శివారులోని దూల గుట్టపై కొలువుదీరిన యాదవులు ఆరాధ్య దైవం మల్లన్న స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా 11 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలు ఆదివారం మాలధారణతో ప్రారంభమయ్యాయి. ఉదయం పవిత్ర గంగాస్నానం ఆచరించిన గ్రామ యాదవులు గ్రామంలో ఆలయవద్దకు చేరుకోగా ఆలయ అర్చకులు యాదవుసంఘ సభ్యులకు మాలధారణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11 రోజుల పాటు ఆలయం వద్ద రోజువారి కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్ద సవంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. తొలిరోజు మాలధారణ కార్యక్రమంలో,యాదవ సంఘం అధ్యక్షుడు గణేష్, కార్యదర్శులు దేవన్న, భూమన్న సభ్యులు హరీష్, బైకాని మహేష్, సుబ్బు, బొగన్న, కులసంఘ పెద్దలు, , యాదవ సంఘాల పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం లేకుంటే విలువలు ఉండవు

● రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్



ఐలాపూర్‌లో ఈరవత్రి అనిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న పద్మశాలి యువకులు

నందిపేట, డిసెంబరు 8: ప్రస్తుత సమాజంలో రాజ్యాధికారం లేకుంటే ఎవరికి విలువలు ఉండవని రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం నందిపేట మండలంలోని ఐలాపూర్ గ్రామంలో పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఈరవత్రి అనిల్ కుమార్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పద్మశాలి కులానికి చెందిన కొండ లక్ష్మణ్ బాపూజీ, సిర్పూర్ యాదయ్యలు పోరాటం చేశారని, అయినప్పటికి మనకు ఎందులో భాగస్వామ్యం లేదని అనిల్ ప్రశ్నించారు. అందుకే పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మనకులస్తులు ఆర్థికంగా వెనక బడిన విషయం వాస్తవేనన్నారు. బీఆర్ఎస్ 10 సంవత్సరాల పరిపాలనలో ఒక్క నోటిఫికేషన్ విడుదల కాలేదని, కాంగ్రెస్ పార్టీ వచ్చిన ఏడాది పాలనలోనే 55వేల ఉద్యోగాలు ఇచ్చిందని రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ తెలిపారు. కుల గణన తర్వాత బీసీలకు రిజర్వేషన్లు పెరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం సంఘం భవన నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈరవత్రి అనిల్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు అవదూత నర్సయ్య, యూత్ అధ్యక్షులు నవీన్, కోశాధికారి పిస్క కుశాల్ తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల మహిళ కమిటీ ఎన్నిక



ఎమ్మార్పీఎస్ మండల మహిళా కమిటీ సభ్యులు

నవీపేట,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మండల మహిళ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షురాలిగా సాయమ్మ, ఉపాధ్యక్షురాలిగా మల్లమ్మ, ప్రధాన కార్యదర్శిగా గంగామణి, ప్రచార కార్యదర్శిగా దేవికనిలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకురాలు సత్యక్క, యమున, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి చిరంజీవి, నర్సింలు, సురేష్ తదితరులున్నారు.

సేవా సంస్థకు ఆర్థిక చేయూత

రెంజల్,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన లచ్చింగిరి సాయిలు అనే వ్యక్తి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన కుటుంబం నిరుపేద కుటుంబం అని తెలిసిన వెంటనే మీ కోసం మేము సేవా సంస్థ ప్రతినిధులు అంత్యక్రియల కొరకు 10వేల రూపాయలను బాధిత కుటుంబ సభ్యులకు అంతజేసి వారి దాతృత్వాన్ని చాటారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి మీ కోసం మేము సేవా సంస్థ ప్రతినిధి రఘుపతి లక్ష్మణ్ సహయ, సహకారాలు అందిస్తూ తోడు నీడగా నిలుస్తుండడాన్ని పెద్దలు, ప్రముఖులు అభినందనలు తెలుపుతున్నారు. వారి సేవలు ఆదర్శ ప్రాయమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అక్లూర్‌లో ఎవరికి సాంఘిక బహిష్కరణ విధించలేదు

● వీడీసీ సభ్యుల వివరణ

వేల్పూర్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామంలో ఎవరికి కూడా సాంఘిక బహిష్కరణ విధించలేదని వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు విలేకరుల సమావేశం వారు తెలిపారు. గ్రామానికి చెందిన జైడి రత్న ఓ కుటుంబానికి గ్రామ బహిష్కరణ విధించినట్టు పేర్కొనడం అబద్ధమన్నారు. ఆమె కుటుంబానికి సాంఘీక బహిష్కరణ విధించినట్లయితే గ్రామ కమిటీ దేనికైన సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విషయమై అవసరమైతే అధికారులు తమ గ్రామానికి వచ్చి విచారణ చేపట్టాలని కోరారు.

రథానికి ప్రత్యేక పూజలు

వేల్పూర్,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామశివారు లో సోమవారం జరగనున్న మల్లన్న స్వామి జాతరలో భాగంగా ఆదివారం సాయంత్రం గ్రామంలో ముస్తాబు చేసిన రథం (షిడే)కి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథం ముందు టెంకాయ కొట్టి రంగు రంగుల బంతి పువ్వలతో తయారు చేసిన తోట్లెను రథానికి కట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగే జాతర ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.



మొక్కు తీర్చుకున్న అన్వేష్‌రెడ్డి

కరపత్రాలను ఆవిష్కరించిన కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాలు బాల్కొండ నియోజకవర్గం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ ఎమ్మెల్యేగా లేకపోనప్పటికీ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, మహిళలకు కల్పిస్తున్న పథకాలు, ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ ప్రజా సేవ చేస్తున్నారని, వీటన్నింటీని ప్రజలకు తెలిసే విధంగా ఈ కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తామని తెలిపారు.

ఓ పాఠశాలకు అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు

ఆర్మూర్‌రూరల్,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని శ్రీజా షిత పాఠశాలకు బెస్ట్ అకా డమిక్ ఎక్సెలెన్స్ అవార్డు లభించినట్టు కరస్పాండెంట్ పొల పల్లి సుందర్ తెలిపారు. శనివారం హైదరా బాద్‌లోని హైటెక్ సిటిలో బ్రెయిన్‌ఫీడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పాఠశాల కరస్పాండెంట్‌కు అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పొలపల్లి సుందర్ మాట్లా డుతూ ప్రతీ ఏట జరిగే అవార్డు ప్రధానోత్సవంలో ఈయేడు తమ పాఠశాలకు రావడం ఆనందంగా ఉంద న్నారు. అవార్డు రావడానికి కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల ప్రొత్సాహం ఎంతో ఉందన్నారు.



అవార్డు అందుకుంటున్న సుందర్

ఎమ్మెల్యేను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవీపేట,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని ఆదివారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నదొడ్డి ప్రవీణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఇటీవల ఆన్‌లైన్‌లో జరిగిన యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికలలో మండల అధ్యక్షుడిగా ఎన్నికైన చిన్నదొడ్డి ప్రవీణ్ కుమార్‌ను ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంచందర్, విజయ్, ఎస్కే బాబు, ఈశ్వర్ రెడ్డి, మహేందర్ గౌడ్ తదితరులున్నారు.

ఏర్గట్లలో కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాలు బాల్కొండ నియోజకవర్గం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ ఎమ్మెల్యేగా లేకపోనప్పటికీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, మహిళలకు కల్పిస్తున్న పథకాలు, ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ ప్రజా సేవ చేస్తున్నారని, వీటన్నింటీని ప్రజలకు తెలిసే విధంగా ఈ కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, గడ్డం జీవన్, బద్ధం లింగారెడ్డి, పాల్గొన్నారు.

బోరుమోటారు మంజూరు



వాడిలో బోర్ డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

వేల్పూర్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం వాడి గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చేందుకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ ద్వారా ఎస్‌డీఎం నిధులు మంజూరైనట్టు గ్రామాభివృద్ధి కమిటఈటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గత కొంత కాలంగా గ్రామంలోని పలు వీదుల్లో తాగునీటి సమస్య తీవ్రం కావడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు సునీల్ దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో స్పందించిన సునీల్‌రెడ్డి ఎస్‌డీఎం నిధులతో మంజూరు చేశారు. ఆ నిధులతో బోరు వేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ తాగునీటి సమస్య తీర్చినందుకు ముత్యాల సునీల్‌కుమార్‌కు స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవం



ప్రజాపాలన విజయోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ముప్కాల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఏడాది పూర్తయినందున ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బూత్‌ల వారీగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరుగుతూ వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు గడ్డం చిన్నారెడ్డి, గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవింద్‌పేట్‌లో మల్లన్నస్వామి జాతర

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివార మల్లన్నస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం వేణుగోపాల ఆలయం నుంచి రథం(షిడే)ను అందంగా అలంకరించి పూజలు నిర్వహించి గ్రామంలోని వీధులగుండా ఊరేగించి గ్రామశివారులోని మల్లన్నస్వామి ఆలయం వరకు తీసుకువెళ్ళి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు అగ్నిగుండం నుంచి నడిచి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మహిపాల్, మాజీఎంపీటీసీ రాజ్‌కుమార్, మాజీఉపసర్పంచ్ బండమీది గంగాధర్, వీడీసీసభ్యులు, గ్రామస్థులు మహిళలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1998 -99పూర్వవిద్యార్థులు

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని విజయ్ హైస్కూల్‌లో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆతీయ సమ్మేళనం నిర్వహించారు. 1998-99 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు 25ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులు ప్రిన్సిపాల్ కవిత దివాకర్, ఉపాధ్యాయులు ఓంప్రకాష్, పిలిప్స్ దుర్గాప్రసాద్, అజిత్‌రెడ్డి, పద్మిణి, అరుణ, లక్ష్మీ, అరుంధతిలతో పాటు విజయ్ విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలతను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు విద్యాసాగర్‌రెడ్డి, అమరవీర్, కరాటే భోజన్న, పూర్వవిద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్మారం జడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అపూర్వం.. విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

డిచ్‌పల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాల తర్వాత ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఒకేచోట కలిసి సందడి చేశారు. అప్పుడు బోధించిన ఉపాధ్యాయులతో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకోవడం మరుపురాని ఘటనగా మిగిలిపోయింది. 2006-07 సంవత్సరంలో పదో తరగతి విద్యాభ్యాసం చేసిన 80 మంది విద్యార్థిని విద్యార్థులు ధర్మారం జిల్లా పరిషత్ పాఠశాలలో అపూర్వ సమ్మేళనానికి హాజరైన విద్యార్థుల ఆనందానికి అవదులు లేవు. ఒక చోట చదువుకున్న విద్యార్థులు కొందరు ప్రభుత్వ ఉద్యోగులుగా, మరికొందరు ఇంజనీర్లుగా, పెళ్లిళ్లు చేసుకొని ఇళ్ల వద్దే స్థిరపడ్డారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల ఉపాధ్యాయుడు గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులంతా కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధ్యమని 2006-07 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఒకచోట చేరి అందరూ కలుసుకునేలా చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం తాను ఎన్నటికి మర్చి పోలేనన్నారు. మరో ఉపాధ్యాయురాలు లక్ష్మి మాట్లాడుతూ 18 సంవత్సరాల తర్వాత తాము ఒక చోట చేరి ఉత్సాహంగా గడుపుతామని ఊహించలేదని విద్యార్థులు చక్కగా చదువుకొని బంగారు భవిష్యత్తును ఆస్వాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చారి, లక్ష్మి, లలిత, గంగాధర్, వినోదిని, విద్యార్థులు పృథ్వి, సుజిత్, రాము, మహేష్, సంతోష్, నగేష్‌లు ఉన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు లక్ష్మి

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేయిర్‌కు ఎంపిక



రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేయిర్‌కు ఎంపికైన నవీపేట విద్యార్థిని ఇందుప్రియ

నవీపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఇందుప్రియ రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేయిర్‌కు ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ హన్మాండ్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం ముగిసిన జిల్లా సైన్స్‌ఫేయిర్‌లో పాఠశాల నుంచి నాలుగు ప్రాజెక్టులను ప్రదర్శించగా జిల్లా స్థాయిలో అవార్డులు వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఇందుప్రియ రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న తమ పాఠశాలకు చెందిన విద్యార్థులను డీఈవో అశోక్ అభినందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అశోక్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.



సైన్స్‌ఫేయిర్‌లో పాల్గొన్న లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో అశోక్



బోధన్‌లోని ప్రభుత్వ వసతి గృహం



ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లు కప్పుకున్న విద్యార్థులు

వసతి గృహాలపై పట్టింపేదీ?

● సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులు ● దుప్పట్లు, స్వెటర్లు అందించకపోవడంతో ఇబ్బందులు

బోధన్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో అడుగడుగునా సమస్యలే దర్శనమిస్తున్నాయి. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించకపోవడంతో అందులో ఉండే విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. చలికాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యార్థులకు అవసరమైన వాటిని అందించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. చలితో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. వసతి గృహాల్లోనే ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల పరిస్థితి కడు దయనీయంగా మారింది. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు ఇప్పటి వరకు దుప్పట్లు, స్వెటర్లు, మంకీ క్యాప్‌లు అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభు/త్వ వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు లేక తలుపులు, కిటికీలు సరిగ్గా లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు భద్రత కరువైంది. వారిని పట్టించుకునే నాథుడు కరువయ్యాడన్న వాదనలు వినిపిస్తున్నాయి. బోధన్‌లో మొత్తం 11 వసతి గృహాల్లో ఉండగా ప్రతీ వసతి గృహంలోనూ సమస్యలే దర్శనమిస్తున్నాయి.

● జాడలేని దుప్పట్లు, స్వెటర్లు, మంకీ క్యాప్‌లు

బోధన్‌లో మొత్తంలో 11 వసతిగృహాలు ఉన్నాయి. ఇందులో ఐదు కాలేజీ వసతిగృహాలు, రెండు ఎస్సీ వసతిగృహాలు, రెండు బీసీ వసతిగృహాలు, ఒక ఎస్టీ వసతిగృహం ఉన్నాయి. అలాగే 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు ఎస్సీ మూడు వసతిగృహాలు, బీసీ రెండు వసతిగృహాలు, ఎస్టీ ఒక వసతిగృహం ఉన్నాయి. చలి కాలం ప్రారంభమైన ఇప్పటి వరకు విద్యార్థులకు దుప్పట్లు, రగ్గులు, స్వెటర్లు, మంకీ క్యాప్‌లు పంపిణీ చేయలేదు. వసతిగృహాల్లోని తలుపులు, కిటికీలు సైతం పగిలిపోయి వాటి ద్వారా చల్లని గాలి గదుల్లోకి వస్తుండడంతో విద్యార్థులు రాత్రి వేళలో వణికిపోతున్నారు.

● పట్టించుకోని అధికారులు

బోధన్ డివిజన్‌లో ఉన్న ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులపై అధికారులకు పట్టింపు కరువైంది. చలితో అనేక వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. చలి జ్వరాలు, ఇతర రోగాల బారిన ప్రమాదమున్న అధికారులు మాత్రం విద్యార్థుల రక్షణ చర్యలు చేపట్టడం లేదు. అధికారుల తీరు వల్ల విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. చదువుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు సరైన వసతులు లేక వసతి గృహాలు వెక్కిరిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చలి కాలంలో విద్యార్థులకు కావాల్సిన దుప్పట్లు, రగ్గులు, మంకీ క్యాప్‌లు, స్వెటర్లు అందించాలని విద్యార్థులు కోరుతున్నారు.



పగిలిన వసతి గృహం కిటికీలు

● త్వరలోనే దుప్పట్లను పంపిణీ చేస్తాం..
- విఠల్, హాస్టల్ వార్డెన్, బోధన్

ప్రభుత్వ హస్టళ్ల విద్యార్థులకు త్వరలోనే దుప్పట్లను పంపిణీ చేస్తాం. ఇప్పటి వరకు ఇంకా దుప్పట్లు వసతి గృహాలకు చేరుకోలేదు. రాగానే పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం. వసతి గృహాల్లోని విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

మార్మోగిన అయ్యప్ప శరణు ఘోష

భక్తి



మద్నూర్‌లో భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ప్రముఖులు



అయ్యప్ప పడి పూజలో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు

మద్నూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వామియే శరణమయ్యప్ప అయ్యప్ప దైవమే శరణమయ్యప్ప శరణు ఘోష మండల కేంద్రంలో మార్మోగింది. మద్నూర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో 33 సమష్టి మహా పడిపూజ కార్యక్రమాన్ని శనివారం రాత్రి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పడిపూజ కార్యక్రమానికి బాన్సువాడ. ఎల్లారెడ్డి, బిచ్కుంద, ఉమ్మడి మద్నూర్, పిట్లం మండలాల నుంచి అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. జుక్కల్ శాసనసభ్యుడు తోట లక్ష్మీకాంతరావు అయ్యప్ప పడి పూజలో పాల్గొని అయ్యప్పల నుద్దేశించి మాట్లాడారు. అయ్యప్ప దీక్ష ఒక పవిత్రమైన కార్యమని పేర్కొన్నారు. పరమ పవిత్రమైన కార్తీక మాసంలో ఏ గ్రామంలో చూసిన అయ్యప్ప స్వాములతో కలకలలాడుతు న్నాయని, ఎక్కడ విన్న అయ్యప్ప శరణు ఘోష మార్మోగు తోందని గుర్తు చేసుకున్నారు. అయ్యప్ప సన్నిధానంలో మాల ధారణలో ఉన్న భక్తులు నిత్యం అయ్యప్ప స్వామి పూజలు నిమ గ్నం కావడం వల్ల అయ్యప్ప దీక్ష స్వీకరించడం వల్ల సమాజం లోని కులమత భేదాలు పేద ధనిక తారతమ్యాలు కనిపించవ ని, దీక్ష సమయంలో ఉపవాసం ఉండటం వల్ల జీర్ణవ్యవస్థకు విశ్రాంతి లభిస్తుందని, దీనివల్ల ఆరోగ్య మెరుగుపడుతుందని గుర్తుచేశారు. ఉపవాసాల వల్ల రక్తం జీర్ణవ్యవస్థ శుద్ధి అవుతాయని శరీరంలో స్థాయికి మించి కొవ్వు కరుగుతుందని అన్నారు. మనసును దుష్ట తలంపుల నుంచి ప్రాపంచిక ఆందోళన నుంచి దూరం చేసుకోవచ్చని పాదరక్షలు లేకుండా నడవటం వల్ల భూమిలోని అయస్కాంత ప్రభావం శరీరంలోని అన్ని భాగాలను ప్రభావితం చేస్తుందని గంధం, కుంకుమ, విభూతి, తులసి మాలధారణ, వల్ల నాడీ వ్యవస్థ బాగా పనిచేస్తుందని శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించుకోవచ్చని పేర్కొన్నారు. వారిలో మార్పు వస్తుందని అన్నారు. తమలో చెడు వ్యసనాలను దూరం చేసుకోవచ్చని సూచించారు.

క్రీడా సమాచారం!!



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీలకు పలువురి ఎంపిక

కామారెడ్డిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో 30 సంవత్సరాల నుంచి 80 సంవత్సరాలలోపు వారికి మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్స్, త్రో, జంప్ వంటి క్రీడల్లో పలువురు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు అసోసియేషన్ ప్రధానకార్యదర్శి నవీన్ తెలిపారు. ఎంపికైన వారిలో లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌కుమార్, అనిల్, అతీకుల్లా, చంద్రశేఖర్, నరేష్, మహేందర్‌చారి, నవీన్, రాజేందర్, సతీష్, నరేష్‌రెడ్డి, కృష్ణ, నరేందర్, రవి, అనిల్‌కుమార్, రాజేందర్, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

సీనియర్ కబడ్డీ పోటీలకు సంగెం విద్యార్థి..

గాంధారి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు మండలంలోని పేట్‌సంగెం జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థిని నేనావత్ సుచరిత ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి తెలిపారు. ఈ నెల 5న జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరించిందని తెలిపారు. 10 వరకు హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటుందని తెలిపారు.

టీయూలో వైఫై రాక విద్యార్థుల ఇబ్బందులు

● పట్టించుకోని వర్సిటీ అధికారులు

డిచ్‌పల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో గత ఆరు నెలలుగా వైఫై కనెక్షన్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహాలతో పాటు గ్రంథాలయంలో కూడా వైఫై సౌకర్యం అధికారులు కల్పించక పోవడంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. విద్యార్థులు మూడు మాసాలుగా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరికి సంబంధిత శాఖ అధికారులకు వైఫై కనెక్షన్ కోసం వినతిపత్రాలు సమర్పించిన బుట్ట దాఖలు చేస్తున్నారని యూనివర్సిటీ విద్యార్థి సంఘ నాయకులు శ్రీనునాయక్ ఆరోపించారు. అంతేకాకుండా విశ్వ విద్యాలయంలో సీసీ కెమెరాలు పనిచేయక పోవడం వల్ల తాము తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని యూనివర్సిటీ అధికారులకు సీసీ కెమెరాలు బాగు చేయాలని వినతిపత్రాలు ఇచ్చినా బుట్టదాఖలు చేస్తున్నారని వాపోయారు.




వర్సిటీలో వైఫై సౌకర్యం కల్పించాలి..

తెలంగాణ విశ్వ విద్యాలయంలో విద్యార్థులకు పోటీ పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో వైఫై సౌకర్యం కల్పించడం యూనివర్సిటీ అధికారుల బాధ్యత. అధికారులకు సదుపాయం కోసం వినతిపత్రం సమర్పించినా ఆ సమస్య పరిష్కరించకపోవడం సరైంది కాదు. వైఫై సౌకర్యం కల్పించకపోతే ఆందోళనకు సిద్ధమవుతాం. - శౌర్య, విద్యార్థి

ఆంధ్రజ్యోతి పరిశీలన



వైఫై లేక గ్రంథాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు



టీయూలో పనిచేయని వైఫై సర్వీస్ రూమ్



గ్రంథాలయం

వైఫై సౌకర్యం కల్పించకపోవడం బాధాకరం..



విశ్వవిద్యాలయంలో చదువుతున్న పేద విద్యార్థులకు వైఫై సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలి. గత కొన్ని రోజులుగా వైఫై సౌకర్యం లేక ఆన్‌లైన్ క్లాసులు వినలేకపోతున్నాం. - సోని, విద్యార్థి

అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడాలి..



తెలంగాణ విశ్వవిద్యాలయంలో గ్రంథాలయంలో వైఫై సౌకర్యం లేక గత కొంతకాలంగా ఇక్కట్లు పడుతున్నాం. అధికారులకు ఎన్నిమార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు విద్యార్థుల బంగారు భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. వైఫై సదుపాయం వల్ల విద్యార్థులకు పోటీ పరీక్షల్లో చదివేందుకుఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
- రాజేంద్ర కుమార్ , విద్యార్థి

రైతులకు మెరుగైన సేవలు అందిస్తా..



బాధ్యతలు స్వీకరిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

బిచ్కుంద,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయమార్కెట్ కమిటీద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తానని చైర్‌పర్సన్ దోడ్లకవిత అన్నా రు.ఆదివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమెతో పాటు వైస్‌చైర్మన్‌గా శంకర్, డైరెక్టర్‌లుగా అశోక్, అజయ్‌పటేల్, శంకర్,రాములు, గోరి,రాజుపటేల్, లక్ష్మీ, మారుతి, హరి, నాగనాథ్‌పటేల్,మన్మథ్‌పటేల్, శివకుమార్, రామకృష్ణరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్‌రెడ్డి, నాగనాథ్,పార్టీ అధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన జుక్కల్ కాంగ్రెస్ నాయకులు

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో విజయం సాధించిన యూత్‌కాంగ్రెస్ నాయకులు ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడితో పాటు జుక్కల్ నియోజక వర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన ఇమ్రాన్, నియోజక వర్గంలోని వివిధ మండలాలకు చెందిన యూత్ అధ్యక్షుడు సీఎం రేవంత్‌ను కలిశారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన వారికి సీఎం పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించినట్లు జుక్కల్ నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రోజ్ తెలిపారు

బీర్కూర్‌లో సామాజిక కార్యకర్తకు ఘన సన్మానం



బీర్కూర్‌లో సామాజిక కార్యకర్తను సన్మానిస్తున్న దృశ్యం

బీర్కూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యకర్త, ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అయ్యాల సంతోష్‌ను ఆదివారం బీర్కూర్ అంబేద్కర్ చౌరాస్తాలో దళిత నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ ఒక వైపు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా అంకిత భావంతో పని చేస్తూ, మరో వైపు ఏఎస్ఆర్ ఫండేషన్ ద్వారా సామాజిక సేవలు చేయడం హర్షణీయమన్నారు. ఇంకో వైపు దళితులన చైతన్యం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంగాల నాయకులు బంగారు రవి, సంగు గోవర్ధన్, బద్రి గంగారాం, బాలకృష్ణ, సుభాష్, లక్ష్మణ్, పవన్,సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక సదస్సులో బహుమతుల ప్రదానం



ప్రకృతి వైపరీత్యాలు అనే ప్రదర్శన జిల్లా మొదటి బహుమతి పొందిన విద్యార్థులు

బాన్సువాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలో బాన్సువాడ పట్టణానికి చెందిన సింధు విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న ప్రవలిక పూజిత ప్రదర్శించిన ప్రకృతి వైపరీత్యాలు అనే అంశంపై జిల్లాస్థాయిలో మొదటి బహుమతి పొందడం జరిగింది. అలాగే ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు నిఖిషా, సాయిప్రియలు ప్రదర్శించిన రవాణా, సాంకేతిక నైపుణ్యంపై తృతీయ బహుమతి పొందడం జరిగింది. వారికి ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్‌చైర్మన్ కాసుల బాల్‌రాజు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్, గైడ్ టీచర్లు కళావతి, హరీష్, రంజిత్‌లు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ ముట్టడిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

కామారెడ్డిటౌన్,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):గురుకుల సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని బీఆర్ఎస్‌వీ రాష్ట్రప్రధానకార్యదర్శి సబ్బనిహరీష్ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని గురుకులాల్లో పౌష్టికాహరలోపం, పరిశుద్ధంగా లేని తాగునీరు, టాయిలెట్స్‌మెయింటెనెన్స్ లేకపోవడం, కాస్మోటిక్ చార్జీలురాకపోవడం తదితర అంశాలను గుర్తించామని తెలిపారు.గురుకులాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి ఉద్యమానికి శ్రీకారం చుడుతామని అన్నారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడు భానుప్రసాద్, నాయకులు పరశురాంగౌడ్, సాయి,రాజేష్, సాయి,సాకేత్, దీపక్,సమీర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న చైర్‌పర్సన్



క్షతగాత్రుడిని తరలించేందుకు అంబులెన్స్‌కుఫోన్‌చేస్తున్న చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. ఆదివారం కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామశివారులోని ఉగ్రవాయి గ్రామానికి చెందిన లింగం అనే వ్యక్తి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు.అటువైపుగావెళ్తున్న చైర్‌పర్సన్ ఆయనను చూసిఅక్కడ ఉన్నవారిని ఆరాతీసింది.వెంటనే 108కు కాల్‌చేసి కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకోవడంతో పాటు వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

● రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకుల దుర్మరణం ● మిన్నంటిన రోదనలు ● బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పోచారం



కారులో ఇరుక్కుపోయిన మృతుడిని బయటకు తీస్తున్న దృశ్యం



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

భిక్కనూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న లారీని ఢీకొని తల్లి, కుమారుడు మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్లితే.. బాన్సువాడకు చెందిన లక్ష్మీ(49) ఆమె కుమారుడు అక్షయ్‌రెడ్డి(28), తల్లి కోర్ల భూమవ్వ, తమ్ముడు రాజేశ్వర్‌రెడ్డితో కలిసి హైదరాబాద్ నుంచి కారులో వారి స్వగ్రామం బాన్సువాడకు ఆదివారం తెల్లవారుజామున బయలు దేరారు. భిక్కనూరు మండలం సిద్ధరామేశ్వరనగర్ గ్రామ శివారుకు వారి వాహనం చేరుకోగానే 44వ జాతీయరహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జై కారు నడుపుతున్న అక్షయ్‌రెడ్డి అందులో ఇరుక్కుని అక్కడిక్కడే మృతిచెందగా, లక్ష్మీ, భూమవ్వ, రాజేశ్వర్‌రెడ్డి తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న భిక్కనూరు ఎస్సై సిబ్బందితో చేరుకుని గాయపడిన ముగ్గురిని 108, జీఎంఆర్ అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వారికి పరీక్షలు నిర్వహించి ముగ్గురిని మెరుగైనా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ లక్ష్మీ మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త నర్సింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతిచెందిన అక్షయ్‌రెడ్డి, లక్ష్మీ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కాగా అక్షయ్‌రెడ్డి మృతదేహం కారులో ఇరుక్కుపోవడంతో పోలీసులు,స్థానికుల సహాయంతో తీవ్రంగా శ్రమించి బయటకు తీశారు.

● దాబాల వద్ద నిలిపిన వాహనాలతో ఇటీవల ఎక్కువ ప్రమాదాలు

భిక్కనూరు మండలంలోని 44వ జాతీయరహదారిపై దాబాల ఎదుట పార్కింగ్ చేసిన వాహనాల కారణంగా ఇటీవల ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పోలీసులు, జీఎంఆర్ సిబ్బంది ఎన్నిసార్లు హెచ్చరించిన, జరిమానాలు విధించిన దాబాల యాజమానుల తీరుమార్చుకోవడం లేదు. ఎలాంటి ఇండికేటర్లు వేయకుండా రోడ్డుపై వాహనాలను నిల్పడం కారణంగా ప్రమాదాలు జరిగి పలువురు ఇదివరకు మృతిచెందగా చాలామంది గాయాలపాలయ్యారు.

బాన్సువాడటౌన్: బాన్సువాడ పట్టణంలోని పాతబాన్సువాడకు చెందిన మాజీ సర్పంచ్ కీ.శే కొర్ల సంగారెడ్డి కూతురు కంచర్ల లక్ష్మీ, మనుమడు కంచర్ల అక్షయ్‌రెడ్డిలు ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో బాన్సువాడలో విషాదచాయలు అలుముకున్నాయి. కామారెడ్డి జాతీయ రహదారిపై లారీని ఢీకొనడంతో కారు నుజ్జునుజైంది. కారులో ప్రయాణిస్తున్న కంచర్ల అక్షయ్‌రెడ్డి, ఆయన తల్లి కంచర్ల లక్ష్మీ మృతి చెందగా , మిగతా వారు గాయపడ్డట్లు స్థానికులు తెలిపారు. కాగా ఆదివారం సాయంత్రం బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు , బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. తల్లీ , కొడుకుల మరణం కుటుంబ సభ్యులకు తీరని వేదన అని, ధైర్యంగా ఉండాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి , సొసైటీ చైర్మన్ ఎర్వల కృష్ణారెడ్డి , దుద్దాల అంజిరెడ్డి , లింగం , తదితరులున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు భరోసా



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలకు భరోసా లభిస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాం తారావ్ పేర్కొన్నారు. ఆదివారం పెద్దకొడప్‌గల్‌లో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ,షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ పథకానికి సంబందించిన చెక్కులను అందజేశారు, ఈసందర్భంగా ఎమ్మెల్యే తోట గత ప్రభుత్వంలో ప్రజలకు సంబందించిన సంక్షేమ పథకాలకు నిధులు ఆలస్యంగా వచ్చేవని కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు సంబందించిన నిధులు తొందరగా రావడంతో ప్రజలకు ప్రభుత్వంపై భరోసా పెరిగిందని తెలిపారు.గతంలో సీఎంఆర్ఎఫ్ నిధులు రావడానికి సంవత్సర కాలం పట్టేదని ప్రస్తుతం తొందరగా వస్తున్నాయని తెలిపారు. దీంతో పాటుగానే గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేస్తున్నదని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పనులు కూడ ఈ నెలలో ప్రారంభం అవుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన లబ్దిదారుల పక్రియ త్వరలో జరగనుందని, ముందుగా ఎస్సీ ఎస్టీ, వితంతులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. జుక్కల్ నియోజక వర్గంలో గత ప్రభుత్వంలో జరగని అభివృద్ధి సంవత్సర కాలంలో జరిగిందని తెలి పారు. ముఖ్యంగా మద్నూర్ నుండి రుద్రూర్ మీదుగా బోధన్ వరకు నాలుగు వరుసల రహ దారి, బిచ్కుంద మండల కేంద్రంలో అడ్వాన్స్‌డ్ ఐటిఐ కళాశాల, మద్నూర్ మండల కేంద్రంలో 305 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు తదితర అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ దశరథ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, నాయకులు మల్లప్ప పటేల్, శ్యామప్ప, పండరి,మొగులా గౌడ్, హైమద్, మారుతి, సం జీవ్, నారాయణ, ఇస్మాయిల్‌పటేల్, శ్రీహరి, ఇందిర పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో 108 అంబులెన్స్



108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్నయ జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మద్నూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పేదలకు అందుబాటులో అత్యవసర సమయంలో అవసరానికి గాను ప్రభుత్వం 108 అంబులెన్స్‌ను ప్రారంభించినట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తెలిపారు. ఆదివారం సాయంత్రం మద్నూర్ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రికి మంజూరైన 108అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే 108 వాహనాన్ని అప్పటి సీఎం ప్రారంభించారని, గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం దానిని నిలిపివేయడంతో పేద ప్రజలకు ఇబ్బందిగా మారిందని అటువంటిది మళ్ళీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. అత్యవసర సమయంలో 108 వాహనం కోసం ఫోన్ నెంబర్ 108గానే ఉంటుందని ఫోన్ చేసి ఏరియా తెలియేసినట్లయితే మన ఇంటి వద్దకు వచ్చి రోగులను తీసుకెళుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిలు, ప్రజ్ఞకుమార్, హన్మాండ్లు, స్వామి, రమేష్, శ్రీనివాస్ పటేల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట పీహెచ్‌సీకి 108 వాహనం



నాగిరెడ్డిపేట పీహెచ్‌సీకి మంజూరైన 108 అంబులెన్స్ వాహనం

నాగిరెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం 108అంబులెన్స్ వాహనాన్ని మంజూరు చేసింది. ఈ నూతన 108 అంబులెన్స్ వాహనం ఆదివారం నాగిరెడ్డిపేటకు చేరుకుంది. కామారెడ్డి- మెదక్ జిల్లాల సరిహద్దు మండలమైన నాగిరెడ్డిపేట మండలంలో 108 వాహనం లేక రోగులు, మండల ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారు.మండలంలో ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగినా, గర్భి ణులకు ఆసుపత్రులకు తరలించాలన్నా అత్యవసరం సమయాల్లో మం డలంలో 108 వాహనం లేకపోవడంతో అవస్థలు పడ్డారు. అత్యవసర సమ యంలో నాగిరెడ్డిపేట మండలానికి ఎల్లారెడ్డి నుంచి వాహనం వచ్చేది. సుమారు 20 కిలో మీటర్ల దూరం ఉన్న ఎల్లారెడ్డి నుంచి వాహనం రావడంలో జాప్యం జరగడంతో మండల రోగులు తీవ్ర అవస్థలు పడేవారు. దీంతో పలువురు మండల ప్రజాప్రతినిధులు మండలానికి 108 వాహనం లేకపోవడంతో అవస్థలు పడ్డారు. అత్యవసర సమయంలో నాగిరెడ్డిపేట మండలానికి ఎల్లారెడ్డి నుంచి వాహనం వచ్చేది. సుమారు 20 కిలో మీటర్ల దూరం ఉన్న ఎల్లారెడ్డి నుంచి వాహనం రావడంలో జాప్యం జరగడంతో మండల రోగులు తీవ్ర అవస్థలు పడేవారు. దీంతో పలువురు మండల ప్రజాప్రతినిధులు మండలానికి 108 వాహనాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో ప్రభుత్వం మండల కేంద్రానికి 108 వాహనాన్ని సోమవారం మండల నాయకులు, అధికారుల సమక్షంలో దీనిని ప్రారంభించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సృజన కుమార్ తెలిపారు.

నేషనల్ కుంగ్‌ఫు కరాటేలో చాంపియన్



కుంగ్‌ఫు కరాటే ఛాంపియన్ షిప్ సాధించిన విద్యార్థులు

నాగిరెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఓపెన్ నేషనల్ కుంగ్‌ఫు కరాటే అండ్ టైక్వాండో పోటీల్లో నాగిరెడ్డిపేట, మండల కేంద్రానికి చెందిన శ్రీసాయిపాఠశాల విద్యార్థులు 2024 ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మహ్మద్ రఫీ తెలిపారు. ఈ ఓపెన్ నేషనల్ కుంగ్ ఫూ కరాటే అండ్ తైక్వాండో పోటీలను శావోలీన్ డ్రాగన్ మార్షియల్ ఆర్ట్స్ అకాడమీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కరాటే పోటీల్లో భాగంగా వివిధ జిల్లాలకు చెందిన సుమారు 35 పాఠశాలలు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. అందులో నాగిరెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శ్రీ సాయిపాఠశాలవిద్యార్థులు తమ ప్రతిభను చాటి ఛాంపియన్ షిప్ 2024ను సా ధించిన ట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ రఫీ తెలిపారు. శ్రీ సాయి పాఠ శాల విద్యార్థులు ఛాంపియన్ షిప్‌ను సాధించిన పట్ల నాగిరెడ్డి పేట మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, పాఠశాల ఉపాధ్యాయులు, మండల ప్రజలు, విద్యార్థులను అభినందించారు.

అంచనూర్‌లో బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

దోమకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంచనూర్ గ్రామంలో బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం కుర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి హజరై పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనకు కష్టం వస్తే ముందుగా గుర్తుకు వచ్చేది భగవంతుడే అని అలాంటి దైవ సన్నిదికి కులసంఘం సభ్యులందరు కలసికట్టుగా ఉండి కష్టపడిన డబ్బులతో పెద్ద ఆలయాన్ని నిర్మించడం సంతోషకరమన్నారు.ఈ సందర్భంగా కుర్మ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కుంట లక్ష్మారెడ్డి, తేలు శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, కంది మనోజ్ కుమార్, రవి, రవీందర్‌రెడ్డి,గాజులపల్లి విఠల్‌రెడ్డి, తెల్ల ప్రభాకర్, శ్రీనాథ్, ఎస్ పాల్, కుర్మ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయ నిర్మాణానికి స్థలం అప్పగింత



స్థలం పరిశీలిస్తున్న ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు

దోమకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):దోమకొండ మండల కేంద్రంలో ఎక్సైజ్ సీఐ కార్యాలయం భవనం నిర్మాణంకు స్థలాన్ని తహసీల్దార్ సంజయ్‌రావు అప్పగించినట్లు ఎక్సైజ్ సీఐ మధుసుదన్‌రావు తెలిపారు. రైతు వేదిక సమీపంలో ప్రభుత్వ స్థలం సర్వేనంబర్ 23లో 0.1250 గుంటల స్థలం సర్వేయర్ శ్వేత మార్కింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎక్సైజ్ సీఐ కార్యాలయం ప్రైవేటు బిల్డింగ్‌లో కొనసాగుతుంది. నూతన భవన నిర్మాణం ఏర్పాటుకు జిల్లా ఎక్సైజ్ అధికారికి స్థలం అప్పగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్‌లు రాజు, బాలు,రికార్డు అసిస్టెంట్ శ్రీనివాస్, దోమకొండ పంచాయతీ కార్యదర్శి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

సర్వే ప్రారంభం



సర్వే నిర్వహిస్తున్న ఇంజనీర్లు

గాంధారి,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గాంధారి మండల కేంద్రంలోని సంగెంరేవు బ్రిడ్జి నిర్మాణ పనుల సర్వే ఆదివారం సంబంధిత ఇంజనీర్లు ప్రారంభించారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఇచ్చిన మాట ప్రకారం ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు బ్రిడ్జి నిర్మాణ పనులపై దృష్టిసారించారు.సర్వే కొనసాగడంతో ఆ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కామారెడ్డిటౌన్,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్‌లో నివాసం ఉంటున్న గంగారపు పోచమ్మ (30) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు దేవునిపల్లిఎస్ఐ రాజు తెలిపారు. శనివారం రాత్రి అడ్లూర్‌లో పోచమ్మ ఆమె భర్తకు మధ్యగొడవజరగడంతో పాటు మృతురాలి మెడముందు భాగం కమిలిన గాయం, కుడిభుజంపై చిన్నగాయం ఉండడంతో అనుమానం వ్యక్తం చేస్తు మృతురాలి తండ్రి కోటయ్య ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా అనుమానాస్పద కేసు నమోదుచేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రారంభమైన దత్త జయంతి ఉత్సవాలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అతిప్రాచీన దేవాలయమైన సంత్ ఆచార్య దత్త మందిరంలో దత్త జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారం భమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి అభిషేకం నిర్వహించారు. వేద పండితుల వేదమంత్రోచ్చరణలతో గణపతి గౌరీ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన పూజలు నిర్వహించారు. ఆలయంలోని ధ్వజస్తంబం వద్ద అర్చకులు మనోహర మహా రాజ్, మాదవ్‌లు ప్రత్యేకపూజలు నిర్వహించి ధ్వజారోహన చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం చుట్టూ అర్చకులు దేవతా మూర్తులను మంత్రాలతో ఆహ్వానం చేశారు. ఈ కార్యక్రమంలో పండితులు యోగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రగతినగర్‌లోగల ఇస్కాన్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగర సంకీర్తన నిర్వహించారు. హరే హరే కృష్ణ.. కృష్ణ కృష్ణ హరే హరే... గోవిందా హరి గోవిందా... శ్రీకృష్ణ లోలా గోవిందా... అంటూ భక్తి పాటలు పాడుతూ భజ నలు చేస్తూ పూర వీధుల గుండా నగర సంకీర్తన చేశారు. అనంతరం ప్రగతి నగర్‌లోని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయం ఆరా ధన చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఇస్కాన్ భక్తులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- రోటి కప్‌డా రోమాన్స్
దర్శన్	- ఝూన్సీ ఐపీఎస్
ప్రియా 35	- అమరన్
ప్రియా 70	- మెకానిక్ రాకి

బాన్సువాడ

మహేశ్వరి	- పుష్ప-2
వెంకటేశ్వర	- ఝూన్సీ ఐపీఎస్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

